## 'భావ' వీచికలు

# 'సంఘమిత్ర' అనగా

**- వేమూరి వేంకట రామనాథం.**

ఇటీవలి ఒక సంచికలో "సంఘమిత్ర" సంపాదకులు ఆ పేరును గురించి వివరిస్తూ, అశోకుని కూతురు "సంఘమిత్ర" అన్న చక్కని గుఱుతు (ఆనవాలు) పాఠకులకు కలిగించారు. అహింసను ప్రచారం చేసిన ఆమెను కొన్ని శతాబ్దాల పిదప అహింసతో హింసను జయించిన మహాత్మాగాంధీని మనస్మృతి పథంలోకి తెచ్చారు. అహింసతో పాటు సద్వర్తన కూడ మానవునికి ప్రధానమన్న నైతిక సూత్రం క్రమంగా వాడి పోతున్నది. ఈ విషయం పాఠకలోకానికి చక్కగా అవగతమయ్యేట్లు ఈ "సంఘమిత్ర" వెలువడింది.

ఇంతేనా, అని కొంత ఆలోచించాను. రచనలో తగు రీతిని "సాంఘిక స్పృహ" ఉండాలి, అన్న నా దృఢ విశ్వాసంతో ఈ వివరణ మొదలు పెడతాను. ఈ శబ్దానికి అర్థం సంఘాన్ని ఉరికించటమని కాదు; రచనలో సంఘానికి ఉపయోగపడే ఇతి వృత్తాలు, రచనా విధానాలు, ఉండటం అని. ఇవి ఆధునిక రచనలలోనే కాదు, వెనుకటి కావ్యాలలో కూడ ఉన్నవని మనవి చేస్తున్నాను. తెలుగులో తొలికావ్యమైన మహాభారతం తిరగ వేస్తే, రాజు ఎలా పరిపాలించాలో, ప్రజయెలా ప్రవర్తించాలో అన్న ఉదంతాలకు చెందిన పద్యగుచ్ఛములెన్నో ఉన్నాయి. నేను "తెలుగు జ్యోతి" లో వ్రాసిన ఒక "మెఱపు"ల వ్యాసంలో నారద - ధర్మరాజు సంభాషణ ఈ విషయానికి చెందినది వివరించాను. మఱొక ఉదాహరణ : "రంగరాయ చరిత్రము" నుండి "రాజకీయ విధాన యోజనోద్యోగంబు లంచిత స్థితి విమర్శించుకొనుచు - ---- సొంపు దీపింప నవనిపాలింపుచుండె." ఈ సందర్భంలో నన్నయగారి "జగద్ధితంబుగన్" అన్న ప్రయోగం మనం మఱువ రాని ఆణిముత్యం; తన రచన జగత్తునకు హితంగా ఉండవలెనని ఆయన తీర్మానించు- కొన్నారు; అంతే కాని పద్యాల సొంపు కొఱకు కాదు.

"సాంఘిక స్పృహ"కు మఱొక అత్యుత్తమ ఉదాహరణం మన ఆది కావ్యమైన వాల్మీకి రామాయణంలో గమనించగలం. తండ్రి మాట పాటించవలెనని, అన్నతో పాటు కష్టాలు పంచుకోవాలని, అవకాశం వచ్చిందిగదా అని కిరీటం తలకెక్కించుకోకూడదని, ఎంతటి మట్టం వారిదైనా మాట పాటించాలని, స్వప్రయోజనం కన్న సంఘానికి చరిత్రలో దక్కే గౌరవం ముఖ్యమని, ఈ ఇతిహాసం అడుగడుగునా నిరూపిస్తుంది. ఒక చిన్నమనవి: వాల్మీకి రాముని దేవునిగా చిత్రించలేదు, దశరథరాజ కుమారునిగాను, నరశార్దూలంగాను మాత్రం మనకు అందించాడు.

ఇక "మైత్రి" అన్న పదానికి వద్దాం. సంక్షిప్తంగా, ఇది రెండు విధాలదై ఉండగలదు. ఒకటి మిత్రునికి కేవలం - లేక తటాలున - ఆనందం కలిగించేది; రెండవది వానికి దీర్ఘకాలంలో మేలు కూర్చేది. మొదటిది క్షణభంగుర గుణం, రెండవది చిరకాలం కలిగించేమేలు. మిత్రులని మురిసి పోయిన దుర్యోధనునికి దుశ్శాసన, శకుని, కర్ణులు నిజానికి హితం చేకూర్చారా? లేదు, ఎప్పటికప్పుడు ప్రియం కలిగించారు. ద్రౌపదీ వస్త్రాపహరణం అనితర ఉదాహరణ. (దుర్యోధనుని సర్వనాశం కలిగించవలెనన్న అంతరుద్దేశ్యంతోనే శకుని "మైత్రి" నటించాడని కూడా ఒక అభిప్రాయం ఉంది.) నిక్కమైన మైత్రి స్వచ్ఛమైన హితం సమకూర్చేదని మన సారస్వత ప్రక్రియలన్నీ తేటతెల్లం చేస్తున్నాయి.


తరువాతి పదం "సంఘం" గూర్చి ప్రసంగించుదాం. దీని నిర్వచనం కాలక్రమేణ, ప్రజల తాత్కాలిక ప్రయోజన రీత్యా, ఊసరవెల్లిలా మారుతూవచ్చింది. ప్రజాబాహుళ్యం సంఘం అన్న తేలిక నిర్వచనం క్రమంగా అనేక ఎద్దడులకు లోనయింది. ఆ బాహుళ్యంలో కొన్ని భిన్నత్వాలను ప్రజ కనిపెట్టదొడగింది. చాల దేశాలలో ఇవి ఆర్థికపరంగా ప్రాధాన్యం వహిస్తే, కొన్ని కొన్ని చోట్ల మత విషయికంగాను, కులవ్యత్యాసాల సంబంధంగాను, "సంఘం" అన్న శబ్దాంతర్యం చీలికలు కాదొడగింది. నేటి ఇరాకు ఒక చక్కని ఉదాహరణ. సున్నీలు, షియాలు, కుర్దులు - అందఱు కలిసిన దేశమది. అయితే, సంఘానికి మైత్రిని తలపించే కార్యక్రమాలు ఏకస్వరంలో పెకలటం లేదు. అలాగే మన దేశంలో కూడ సంఘం ఎంతగా ముక్కలు ముక్కలుగా - సాధారణ, దైనందిన వ్యవహారాలలో - పరిగణింపబడుతున్నదో, దానికి ప్రభుత్వం నుండి, చట్టం నుండి ఎలా నార్లు ప్రాప్తిస్తున్నాయో మనం ఎఱిగిన విషయమే. ఒక్క సారస్వతరంగం తీసుకుందాం. అభివృద్ధి పేరిట ఎన్ని రకాల రచనలు బయలుదేరుతున్నాయో, ఈ పాఠకవర్గానికి నేను చెప్పనక్కఱలేదు. ఏది సవ్యమో ఎవరికెఱుక? భావి మాత్రం నిర్ణయించగలదు.

ఈ చర్చ యొక్క సారాంశం ఏమంటే సాంఘికశ్రేయస్సు అన్న వాంఛనీయతకు వ్యక్తుల మైత్రి ఏ విధంగా ఉండవలెను అన్న ప్రశ్న క్లిష్టం కాజొచ్చింది. కాని వ్యక్తిని మించిన సంఘం ఒకటి ఉన్నదని, దాని ఆనందం కొఱకు మన మందఱము పాటుపడవలెనని మాత్రం అందఱు అంగీకరించే తార్కిక సత్యమే.

సమాపనంలో ఒక ప్రత్యేక వివరం గమనించుదాం. సంఘం శ్రేయస్సు కొఱకు ప్రతి వ్యక్తి పెనుగులాడవలెనన్న ఉత్తమ సత్యం మనం సర్వదా మనసులో ఉంచుకోవాలి. ఇక్కడ ఒక దురదృష్ట అంశం ఉంది. సంఘంకోసం అవలంబించవలసిన కార్యక్రమాలలో ప్రత్యేక వ్యక్తుల స్వంత శ్రేయస్సు దెబ్బతినవచ్చును. బ్రిటిష్ వారి గుండుదెబ్బకు జలియన్ వాలాబాగ్ లోని వ్యక్తులు - "విశాఖి" ఉత్సవానికి మూగినవారు - ఇంధనం అయినారుగదా. వారి లాఠీలకు లజపతిరాయ్ వంటి వారి శిరస్సు శాశ్వతంగా వణకుకు లోనయినది గదా. భగత్ సింగ్ ఉరికంబం ఎక్కాడు గదా. ఇక కారాగృహం మాట లెక్కలేదు! ఈ ఉదాహరణలలో వ్యక్తమయ్యే సత్యమేమంటే సంఘశ్రేయస్సుకోసం వ్యక్తులు తమ స్వంతక్షేమం వర్జింపవలసియుంటుంది. అదే వ్యక్తికి సంఘానికి గల మైత్రికి పతాక. మనదేశం సందర్భంలో

చెప్పవలెనంటే మహాత్ముని అహింసా సమరకాలంలో ఇది చిరునగవుతో వ్యక్తులు అవలంబించారు. క్రమంగా ఆ చిరునగవు వెలిసిపోతున్నది. సంఘంతో వ్యక్తికి గల మైత్రి ధ్యేయం సన్నగిల్లుతోంది.

ఈ "సంఘమిత్ర" నామకరణంలోని నిగూఢార్థం ఇంత లోతుగా ఆలోచించియే ఆ పేరు నిర్ణయింపబడినదేమో తెలియదు కాని, దాని సంపాదక వర్గానికి నా అభినందనలు. నన్ను ఒక వ్యాసం వ్రాయుమని కోరిన వారికి నా మైత్రి, నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.



## కృతజ్ఞతలు

వేమూరి వేంకట రామనాధం గారితో మా పరిచయము కొన్ని మాసములు మాత్రమే అయినా, ఎప్పటినుంచో వారిని తెలుసునన్న భావన కలుగుతూ ఉంటుంది. 'సంఘమిత్ర' గత నాలుగు సంచికలు చూసి, అందులో ప్రతి అంశము గురించి ఆయన చర్చించడము మా అదృష్టం. ఆయన అనుభవాలు మాతో పంచుకోవడం మా పూర్వజన్మ సుకృతం. రామనాధం గారిని కలిసే అవకాశము మాకు కలిగించిన 'తెలుగువాణి' సభకు, సారధి (దేవాలయ అర్చకులు) శ్రీనివాస్ గారికి, ధన్యవాదములు. భోజరాజును చూస్తే పామరుడు కూడా కవిత్వం చెప్పగలిగేవాడట. రామనాధంగారితో పరిచయమైన తరువాత మాలో నూతనోత్సాహము కలగడం, కాగితముపై కలము కదలడం - పదములు పాదములుగా, పాదములు పద్యములుగా, పద్యములు హృద్యముగా రూపాంతరము చెందడము చెప్పుకోదగ్గ విశేషము. మాకు ఆయన అందించిన ప్రోత్సాహము, సలహాలు అమూల్యం.

"సంఘమిత్ర" నామకరణము, రామనాధం గారు చెప్పినట్లు, అంత లోతుగా ఆలోచించి నిర్ణయించామా - అంటే అవుననే చెప్పాలి. సమాజానికి వ్యక్తికి గల సంబంధం చాలా బాధ్యతతో కూడినది. అందులో ప్రతివ్యక్తి ముద్ర సమాజం మీద ఉంటుంది. సమాజానికి మనవంతుగా ఏదైనా అందించాలి. అంటే మరొక విధముగా మనకు మనం సహాయం చేసుకోవడమన్న మాట. ఈ ఉద్దేశ్యము రామనాధం గారి నిర్వచనముతో ఏకీభవిస్తోందనే నమ్ముతున్నాము.

భావన అనగా తలంపు. భావ అనగా పూజ్యుడు అని అర్థం. వీచి అనగా కెరటము. వీటిని దృష్టిలో ఉంచుకొని 'భావ' వీచికలు అని ఈ శీర్షికను రూపొందించడం జరిగింది. కోరిన వెంటనే కాదనకుండా ఈ వ్యాసాన్ని అందించిన మిత్రులు శ్రీ రామనాధంగారికి ధన్యవాదములు తెలుపుకుంటూ

\- సంపాదకవర్గం.